క్లుప్తంగా

'యూరియా విక్రయంపై ఆరోపణలు సరికాదు'

పెంచికల్‌పేట్‌: గొంట్లపేట్‌ గ్రామంలో ఫర్టిలైజర్‌ దుకాణం నిర్వహిస్తున్న తనపై అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నానని ఆరోపణలు చేయడం సరికాదని చౌదరి గోపాల్‌ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం పొతెపల్లి గ్రామానికి చెందిన తెలిగె మల్లేష్‌ అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నాని, అతనిపై దాడికి యత్నించానని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. నిరాధారణమైన ఆరోపణలు చేసిన మల్లేష్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో కారోబార్‌ మృతి


భాస్కర్‌ (ఫైల్‌)

కౌటాల: కౌటాల గ్రామ పంచాయతీ కారోబార్‌ దొమ్మటి భాస్కర్‌(60) శనివారం అర్ధరాత్రి గుండెపోటులో మృతిచెందారు. శనివారం అర్ధరాత్రి ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పి ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. స్థానిక ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం బీజేపీ నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు, పంచాయతీ కార్మికులు, డీసీఎంఎస్‌ వైస్‌చైర్మన్‌ కుమురం మాంతయ్య, కౌటాల మాజీ ఎంపీపీ బసర్కార్‌ విశ్వనాథ్‌, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్‌ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడికి భార్య రాణి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న సల్మాన్‌ఖాన్‌

ఆసిఫాబాద్‌: బెజ్జూర్‌ మండలం తలాయి గ్రామానికి చెందిన గర్భవతికి అత్యవసర పరిస్థితిలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎండీ సల్మాన్‌ తనతో పాటు మరో సహచరుడితో కలిసి రక్తదానం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో గర్భిణీ సద్మెక లక్ష్మి రక్తహీనతతో బాధ పడుతుండగా, విషయం తెలుసుకొని రక్తదానం చేశారు.

'దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

ఆదిలాబాద్‌రూరల్‌: ఆదిలాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గల బంగారుగూడ కాలనీలో నివాసం ఉంటున్న మాదిగ కులస్తులపై నాలుగు రోజుల కిందట జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాదిగ రిజర్వేషన్‌ పోరాట సమితి నాయకులు అన్నారు. ఆదివారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 8 మంది మాదిగ కులస్తులపై దాడి జరిగగా.. అందులో నలుగురు మహిళ బాధితులు ఉన్నారన్నారు. కొంత మంది రౌడీ మూకల్లాగా ఏర్పడి అకారణంగా దాడి చేయడం సరికాదన్నారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు కుడాల స్వామి మాదిగ, కాంబ్లే బాలాజీ, అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్‌, ఓం ప్రకాష్‌, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో రేషన్‌ దుకాణాలు

నేరడిగొండ: మండల ప్రజలకు అందుబాటులో రేషన్‌ దుకాణాలను ఏర్పాటు చేయడం జరిగిందని బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ అన్నారు. మండలంలో దూర ప్రాంతాల ప్రజలు రేషన్‌ సరుకులు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడటాన్ని గమనించి సంబంధిత అధికారులతో మాట్లాడి నూతనంగా మండలంలో తొమ్మిది రేషన్‌ షాపులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. కుంటాల(కె), నాగమల్యాల్‌, తిమ్మాపూర్‌, పీచర, లక్ష్మీపూర్‌, గోవింద్‌పూర్‌, బుద్ధికొండ, రాజులతండా, ఆరెపల్లిలలో మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇకనుంచి వారి వారి గ్రామాల్లో రేషన్‌ తీసుకునే వీలుంటుందన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మంచిర్యాలఅర్బన్‌: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచిగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని జిల్లా షీటీమ్‌ ఎస్సై హైమ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర (షెడ్యూల్‌ కులాల) వసతి గృహంలో ఆదివారం విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆకతాయిల ఆట కట్టించి మహిళలకు రక్షణ కల్పించటమే షీటీం కర్తవ్యమన్నారు. సైబర్‌ నేరాలు, కొత్త చట్టాల గురించి వివరించారు. షీటీం సభ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'మధ్యాహ్న భోజనం'

- ప్రతీ నెల 10వ తేదీలోపు బిల్లులు
- వేతనాల చెల్లింపులకు ఆదేశం
- పర్యవేక్షణ మరింత కఠినం

గడిచిన కొంత కాలంగా వేతనాలు రాక, మధ్యాహ్న భోజన బిల్లులు సకాలంలో అందక ఇబ్బందులు పడ్డ వంట ఏజెన్సీ నిర్వాహకులకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శుభవార్త చెప్పారు. ఇక నుంచి ప్రతీనెల 10వ తేదీలోపు గౌరవ వేతనాలతో పాటు, ఎండీఎం బిల్లులను సైతం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే కోడిగుడ్లతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తామని నిర్వాహకుల నుంచి లిఖిత పూర్వక హామీ తీసుకోనున్నారు.


జెడ్పీఎస్‌ఎస్‌ గోయగాంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయుడు


వంట చేస్తున్న నిర్వాహకురాలు

కెరమెరి: సర్కారు బడుల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పోషణ విలువలతో కూడిన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. 2024 –25 విద్యా సంవత్సరం నుంచి 'మధ్యాహ్న భోజనం' పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నిర్వాహకుల సమస్యల పరిష్కారంపై ఆ శాఖ దృష్టి సారించింది. ఇక నుంచి ప్రతీ నెల 10వ తేదీలోపు బిల్లులతో పాటు గౌరవ వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నిర్ణయంపై ఏజెన్సీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు సకాలంలో మంజూరు చేస్తే కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలుకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండదని వారు పేర్కొంటున్నారు. ఏజెన్సీలోని జైనూర్‌, లింగాపూర్‌, సిర్పూర్‌(యూ), కెరమెరి మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు 254 ఉండగా ఎండీఎం నిర్వాహకులు 343 మంది, విద్యార్థులు 8422 మంది ఉన్నారు.

లిఖిత పూర్వక ఒప్పంద పత్రం..

బిల్లులు సకాలంలో చెల్లించనున్న నేపథ్యంలో మధ్యాహ్న భోజన పథకం నిబంధనలు, అమలుపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. రోజువారి ఆహార పట్టికను పాఠశాల ఆవరణలో ప్రదర్శించాలని ఆదేశించింది. విద్యార్థులకు వారానికి మూడు కోడిగుడ్లు అందజేసేలా ఏజెన్సీల నుంచి లిఖిత పూర్వక ఒప్పంద పత్రం తీసుకోనున్నారు. భోజన మెనూ వివరాలను ప్రతీ రోజు తెలంగాణ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ మొబైల్‌ యాప్‌లో ప్రధానోపాధ్యాయులు పొందుపరుస్తారు. విద్యార్థులతో కూడిన ఓ కమిటీ బియ్యం సరుకుల తూకాన్ని సరి చూస్తుంది. సంబంధిత రిజిస్టర్‌లో వివరాల్లో తేడాలు ఉన్నట్లు తేలితే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాలి. పిల్లలకు అందజేసే ఆహారం, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వంటలు పరిశుభ్రత వాతావరణంలో తయారు చేయించాలి. విద్యార్థులు చేతులు శుభ్రంగా కడుక్కునేలా ఏర్పాట్లు ఉండాలి. పథకం అమలుపై 'అమ్మ ఆదర్శ' కమిటీల ఆధ్వర్యంలో సమీక్షలు జరపాలి.

ఏజెన్సీ మండలాల్లో పాఠశాలల వివరాలు..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	ఎండీఎం నిర్వాహకులు
జైనూర్‌	68	2503	113
సిర్పూర్‌(యూ)	58	1623	67
లింగాపూర్‌	44	1508	52
కెరమెరి	8	2788	111

ఉపాధ్యాయులు రుచి చూడాలి..



భోజనాన్ని ఇకపై ఉపాధ్యాయులు రుచి చూసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలి. నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించేలా చర్యలు చేపడుతున్నాం. గుడ్లు తప్పనిసరిగా అందించేలా పర్యవేక్షిస్తాం. అన్ని పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం.

– కుడ్మెత సుధాకర్‌, ఎంఈవో

బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలి


ఎంపీ గోడం నగేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: రాష్ట్రంలో ఉన్న బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఆదివారం గోలేటికి వచ్చిన ఎంపీ గోడం నగేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు బోగే ఉపేందర్‌, రాయిల్ల నర్సయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బొగ్గు బ్లాకులను వేలం వేస్తే భవిష్యత్తులో బొగ్గు బ్లాకులు లేక సింగరేణి సంస్థ నిర్వీర్యమవుతుందన్నారు. బొగ్గు బ్లాకులను నామినేషన్‌ పద్ధతిలో సింగరేణికి కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సింగరేణి సంస్థను కాపాడాలన్నారు. కేంద్రం మొండి వైఖరికి బొగ్గు బ్లాకులను వేలం వేస్తే సింగరేణి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గుజరాత్‌, ఒడిస్సా, జార్ఖండ్‌ రాష్ట్రాల్లో నామినేషన్‌ పద్ధతిలో కేటాయించారని రాష్ట్రంలోనూ అదే విధంగా సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించాలని కోరారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హైపవర్‌ కమిటీ వేతనాలు చెల్లించేలా కృషి చేయాలన్నారు.

కోతల రోడ్డుపై నడిచేదెలా..?





కెరమెరి: మండలంలోని పరంధోళికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డంతా పగుళ్లు తేలింది. గుంతలు పడి, బండరాళ్లు తేలి, ఎక్కడికక్కడ కోతకు గురికావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఉమ్రి నుంచి పరంధోళి వరకు నాలుగు కిలోమీటర్లు మేర రోడ్డు ధ్వంసమైంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని మండలవాసులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


అగర్‌గూడలో పరామర్శిస్తున్న కోనేరు కోనప్ప

పెంచికల్‌పేట్‌: మండలంలోని లోడుపల్లి గ్రామానికి చెందిన నికాడి బాపురావు, అగర్‌గూడ గ్రామానికి చెందిన సిడాం ఆకాష్‌ గత రెండు రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎల్లూర్‌ గ్రామానికి చెందిన సుంపుటం లలితకు ఇటీవల తుంటి ఎముక ఆపరేషన్‌ జరగ్గా పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచులు శ్రీనివాస్‌, సంజీవ్‌, నాయకులు చౌదరి తిరుపతి, సముద్రాల రాజన్న, సయ్యద్‌ సాజీద్‌, మారన్న, వెంకన్న తదితరులు ఉన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్‌: బెజ్జూర్‌ మండలానికి చెందిన సామల రాజన్న మాతృమూర్తి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పార్థివదేహానికి నివాళులు..


బెజ్జూర్‌ మండలంలోని ఇప్పలగూడ గ్రామానికి చెందిన కొడప సిద్ధయ్య అనారోగ్యంతో శనివారం మంచిర్యాల ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న సిర్పూర్‌ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గ్రామానికి చేరుకొని సిద్ధయ్య పార్థివదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాస్‌, ఇస్తారి, సాయి, శంకర్‌, అనిల్‌, చంద్రశేఖర్‌, బషారత్‌ ఖాన్‌, రాజారాం, అనిరుద్దీన్‌, సత్తయ్య, జావిద్‌, మల్లాజీ, సతీష్‌, జ్యోతిరావు, మనోహర్‌ ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్‌)లో 1992 –93 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక బంధన్‌ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా తమకు చదువులు చెప్పిన గురువులు మూర్తి, డేవిడ్‌, గుప్తా, బాపుగౌడ్‌లకు పాదాభివందనం చేసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

బడి బయటే బాల్యం



ఆసిఫాబాద్‌రూరల్‌: బడీడు పిల్లలు బడిలో ఉండాలని అధికారులు నెలరోజుల పాటు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కానీ కొంత మంది పిల్లలు బడికి వెళ్లకుండా బయట తిరుగుతూ దర్శనమిస్తున్నారు. మండలంలోని మోతుగూడ సమీపంలోని ఇటుకలు, బావి రింగులు తయారు చేసేందుకు ఆంధ్ర నుంచి ఐదు కుటుంబాలు వలస వచ్చాయి. ఆయా కుటుంబాలకు చెందిన పిల్లలు బడికి వెళ్లకుండా బయట తిరుగుతున్నారు. అధికారులు స్పందించి వారిని వెంటనే బడిలో చేర్పించాలని, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ నిర్వహించాలని కోరుతున్నారు.

కానరాని స్వచ్ఛత

- రోడ్లపై నిలుస్తున్న మురుగునీరు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు


పెంచికల్‌పేట్‌లో రోడ్డుపై చెత్తకుప్ప


అగర్‌గూడలో రహదారిపై నిలిచిన మురుగునీరు

పెంచికల్‌పేట్‌: గత రెండు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. వర్షాలకు రోడ్లపైన మురుగునీరు వచ్చి చేరుతుండటంతో గ్రామాల్లో స్వచ్ఛత కరువైంది. ప్రభుత్వం పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి డ్రైడే వంటి కార్యక్రమాలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో సిబ్బంది తీరు భిన్నంగా ఉంది. దీంతో మురుగునీటితో రానున్న రోజుల్లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పొంచి ఉన్న వ్యాధుల ముప్పు..

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురుగునీటి ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చేతి పంపుల వద్ద, తాగునీటి వనరుల వద్ద నీటి కాలుష్యం జరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఒకవైపు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో సీజనల్‌ వ్యాధులు మలేరియా, టైఫాయిడ్‌, కలరా, డెంగీ, చికెన్‌ గున్యా, మెదడువాపు వంటి వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది.

మండలంలో ఇదీ పరిస్థితి..

- ఎల్కపల్లి మండల కేంద్రంలో రహదారి పక్కన ఉన్న డ్రెయినేజీలను ఆక్రమించడంతో మురుగునీరు ప్రధాన రహదారిపై నుంచి స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలోకి ప్రవహిస్తుంది.
- అగర్‌గూడ పంచాయతీలో రోడ్డుపై ఏర్పడిన గుంతలోకి మురుగునీరు వచ్చి చేరడంతో దోమలకు, పందులకు ఆవాసంగా మారింది.
- బొంబాయిగూడ పంచాయతీలో రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకొనిపోవడంతో సీజనల్‌ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.
- చేడ్వాయి పంచాయతీలో గుట్టలవాడలో మురుగునీరు ఇండ్ల మధ్య ప్రవహిస్తుండటంతో రోగాలు ప్రబలే అవకాశం ఉంది.
- ఎల్లూర్‌ పంచాయతీలోని కోయచిచ్చాల వద్ద గల దిశ పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలుస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- పెంచికల్‌పేట్‌ పంచాయతీలో ఎస్సీ కాలనీలోని డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకొని పోవడంతో మురుగునీరు నిలుస్తుంది.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. ప్రతీ వారం రెండు రోజులు డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో కలిసి ప్రణాళికలు రూపొందించాం. – అల్బర్ట్‌, ఎంపీడీవో, పెంచికల్‌పేట్‌

సారంగపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మందమర్రిరూరల్‌: మండలంలోని సారంగపల్లి గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మందమర్రి ఏరియా జీఎం మనోహర్‌ రామకృష్ణాపూర్‌ ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో ఉషాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యంపై సింగరేణికి ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. వర్షాకాలం గ్రామాల్లో వాతావరణ మార్పు వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగరేణి వైద్యులు శ్రీధర్‌, జయవాణి, వైద్య సిబ్బంది, అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నుంచి బీజేపీలోకి చేరికలు


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ నగేశ్‌

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఆదిలాబాద్‌ ఎంపీ గోడం నగేశ్‌ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌, వాంకిడి మండలానికి చెందిన కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీల నుంచి పలువురు నాయకులు ఆదివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వాంకిడి మాజీ ఎంపీటీసీ దుర్గం పెంటు, కిరిడి మాజీ ఎంపీటీసీ సోమేశ్వర్‌, మాజీ వార్డుసభ్యులు మల్లయ్య, సోమయ్య, రాజేశ్‌, మహేశ్‌, అక్షయ్‌, సాయి కండువా కప్పుకున్నారు. ఆసిఫాబాద్‌లో మాజీ ఎంపీటీసీ ఎకిరాల సుగుణాకర్‌, మాజీ వార్డుసభ్యులు సింగాడె అశోక్‌లతో పాటు పలువురు కార్యకర్తలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌, నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, విజయ్‌, మల్లిఖార్జున్‌, సతీశ్‌బాబు, విశాల్‌, మురళి, జయరాజ్‌, సుచిత్‌ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్‌: మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సాయివైకుంఠ ట్రస్ట్‌ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌ యాదవ్‌ అన్నారు. ట్రస్ట్‌ చైర్మన్‌ డాక్టర్‌ రవికిరణ్‌ యాదవ్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని 200 మంది మహిళలకు ఎంబ్రాయిడరీ, టైలరింగ్‌, బ్యూటీషియన్‌ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు శిక్షణ పొంది కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్‌సభ్యులు విజయ్‌బాబు, గటయ్య, భీమన్న, సిబ్బంది శ్రావణి, పూజ, వీణా, మీన, పూజిత, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య బయలుదేరిన ఆర్యవైశ్య బృందం


అయోధ్యకు బయలుదేరిన ఆర్యవైశ్యులు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులు ఆదివారం అయోధ్యకు రైలులో బయలుదేరి వెళ్లారు. అయోధ్య రామమందిరం పరిసర ప్రాంతంలో బ్రహ్మశ్రీ ఫణితుల మేఘరాజ్‌ శర్మ ఆధ్వర్యంలో శ్రీమద్‌ రామాయణ ప్రవచనంలో పాల్గొననున్నారు. రామాయణ ప్రవచనం ఈనెల 16వ తేదీ నుంచి 24 వరకు ఉంటుందని భక్తులు తెలిపారు. అయోధ్యకు బయలుదేరిన వారిలో చిలువేరు గంగాధర్‌, గణపురం ప్రకాశ్‌, కొడిపాక కృష్ణమూర్తి, తూడురు కృష్ణమూర్తి, వెంకన్న, పాలెపు మురళీధర్‌, గజ్జల సురేశ్‌, రాజేశం, గణపురం శ్రీనివాస్‌, సిద్దేశ్వర్‌, తదితరులు ఉన్నారు.